

—Reynolds's Illustrated News.

యూరపును సమ్మోహనపరచి యుద్ధములో ముంచివేయడానికి ప్రస్తుతపు డిక్టేటర్లు యెన్నో వేషాలు వేస్తున్నారు. ఇప్పుడు యెక్కువగా సింగారించుకొంటున్నది జర్మనీ.

# అంతా భ్రమ

శ్రీ వరస సత్యవతి

"నాన్నా! ఇవాళ అన్నయ్యపేరు పత్రికలో పడింది; ఎందుకని?" అన్నాడు సత్యం.

"ఏమీ లేదు, ఏదో కథ వ్రాస్తే పడింది" అన్నాడు, తండ్రి, రామానుజరావు.

"అయితే, నాన్నా! ఏదైనా కథవ్రాస్తే పత్రికలో వేస్తూంటారా?"

"ఆఁ, చమత్కారంగా ఉంటే సరి."

"ఓస్, ఇంతేనా! ఐతే, నాకీసంగతి ఇదివరకే చెప్ప లేక పోయావా? ఎన్నో కథలు వ్రాసేసే వాణ్ని, ఈపాటికి."

"అన్నయ్య వ్రాసినట్లు నువ్వు వ్రాయగలవా? అంత హాస్యంగాను, అంత బాగాను. అంత ...?"

"అంతా అన్నయ్య బ్రహ్మేనా ఏంటి? నేనుకూడా వ్రాయగలను గాని, పత్రిక కెలాగ పంపడం?"

"కవరులో పెట్టి ముక్కానీబిళ్ల అంటించి, పత్రిక పేరు వ్రాయాలి."

"ఈసంగతి మొన్ననే చెప్తేనా,..., మొన్ననే నువ్విచ్చిన అణాలోను ముక్కానిపెట్టి బిళ్ళకొని, కథరాసి పంపేసే వాడ్ని, పోనీ, ఇప్పుడైతే ఏంలే, పెద్ద కథవ్రాసి పంపించేస్తాను. "అంటూ అలా చేయడం కోసం, ఎలక చూసిన పాములాగ' సత్యం వాకట్లోకి పరిగెత్తాడు.

రామానుజరావునకు ఒక స్కూలు మేనేజిమెంటు కూడా ఉంది. తన సౌకర్యంకోసం ఆ బడిని కొద్ది దూరం లోనే ఏర్పాటు చేసుకున్నాడు. ప్రసుతం స్కూలు మేనేజిమెంటు విషయంలో అతని నెమ్మది, నేర్పు, ఓర్పున్నూ ఏమీ పనికి రావడంలేదు. ఆ స్కూలు హెడ్డుమాస్టరు పోస్టులో, ఈ నెలలోనే, ఒకరి తరువాత ఒకరుగా, ఆరుగురిని నియమించడం, వారందరూ కూడా, ఒట్టెట్టినట్లు, రెండుమూడు రోజులకంటె ఉండకుండా, తమ హోదాకు రాజీనామా ఇచ్చి వెళ్ళిపోవడం తటస్థించింది. ఆస్థానానికే ఇప్పుడు క్రొత్తగా కోటిరెడ్డిఅనే విద్యాధికుడ్ని, సుగుణ సంపన్నుణ్ని, నియమించాడు. క్రొత్త ఉద్యోగం కనుక మేనేజరుగారి ఇంటి సమీపంలోనే నివాసం ఏర్ప

రచుకొని కాలక్షేపం చెయ్యాలని నిశ్చయించుకొన్నాడు కోటిరెడ్డి.

ఈరోజులలో ఉద్యోగం రావడం ఒక ఎత్తు, వచ్చాక నిలబెట్టుకోడం ఒక ఎత్తు—నిలబెట్టుకోడం అంటే రోజూ ఉదయం సాయంత్రం బాగా ఆశ్రయించాలన్న మాట. మన బడిపంతులు కూడా అలాగే చేశేవాడు. లాంఛనం తప్పకుండా, మొదట లోపలికి కబురుచేసి, లోపలికి రమ్మని శెలవుఅవగానే, అతి నమ్రతతో, సర్కసు పెద్ద పులి బోనులో ప్రవేశించినట్లు, మేనేజరుగారి వసారాలోకివెళ్లేవాడు. నేడు ఉదయంకూడా అలాగే మేనేజరుగారి సముఖానికెళ్ళి, సిపాయిలాగ నించుని నమస్కరించాడు. దానికి ప్రతి నమస్కారాన్ని ఒకదాన్ని వదిలిపి రుణ విముక్తుడయ్యాడు రామానుజరావు. కొంతసేపు మాట్లాడాక, నాభిదగ్గరనుంచి అన్నాడో, నాల్క చివర నుండి అన్నాడో గాని, "మీరు మా స్కూలుకు దయచేసి ఒకసారి పరీక్ష చెయ్యాల"న్నాడు కోటిరెడ్డి. దానికి సరితూగేటంత ఉత్సాహంతోనే, "సరే" అన్నాడు రామానుజరావు. ఇంతటితో ఇద్దరూ సినిమా అనంతరం ప్రేక్షకుల లాగ విడిపోయారు.

కోటిరెడ్డి కొడుకు సుబ్బిరెడ్డికూడా మన సత్యంతో సమానవయస్కుడే, సమాన విద్యా ప్రవీణుడే కూడాను. ఎప్పుడేనా బడికి వెళ్ళడమే సంభవిస్తే, ఇద్దరూ కూడా మూడవతరగతిలోనే చిట్టచివరకు కూర్చుంటారు. ఆ పిల్లవాడు సత్యం కూర్చుని రాసుకుంటూన్న అరుగుమీదకు తయారయాడు, ఇతని వ్రాయడం దీక్షచూస్తే అతనికి కష్టంతోచింది. అతని స్కూలుడ్రెస్సు, వేషం చూడగానే సత్యం ఈర్ష్యా పరవశుడై కాగితము పెన్సలు క్రింద పెట్టేశాడు.

"ఏంటి చేస్తున్నావ్?" అన్నాడు సుబ్బిరెడ్డి.

"ఏమీలే..., పత్రికకు కథ రాస్తున్నాను, గాని,... నేనుకూడా స్కూటులో చేరదామని ఉందోయ్."

"నువ్వు స్కూటు వెళ్లా అవుతావులే? స్కూటుఅవడానికి ఎంత ధైర్యం ఉండాలి; ఎంత చురుకు ఉండాలి, ఎంత తెలివితేటలుండాలి. నువ్వాపనికి పనికిరావుగాని..., నువ్వు కథరాసి ఏంచేస్తావు?"

"పత్రికకు పంపుతా."

"పంపితే?"

"పత్రికలో నాపేరుతో వేస్తారు."

"వేస్తే?"

"అందరూ నాకథ చదువుతారు."

"అదీ మంచిపనే. నువ్వు గొప్ప ప్రయత్నమే చేస్తున్నావే! నువ్వు పంపేకథను మానాన్నగార్కి చూపిస్తాను." అని అక్కడనే నేలమీదపడి ఉన్న కాగితాలను, అనాథ కుక్కుట కిశోరాన్ని సిరుడాళ్వారు తన్నుకుపోయినట్లు, లాగుకొని పరిగెత్తాడు సుబ్బిరెడ్డి, మరేటూ చేయలేక, తన ప్రజ్ఞయందలి వాత్సల్యాన్ని విడువలేక, దూడని తీసికొని వెడుతుంటే ఆవు వెనుక పరిగెత్తినట్లు, సత్యం కూడా స్కూలుకేసి కోపంతో పరిగెత్తాడు.

పదిగంటలు దాటింది. ఏంచేతనో హెడ్మేస్టరు ఇంకా రాలేదు. క్లాసులో పిల్లలందరూ అప్పుడే వచ్చి ఉండుటచే, స్కూలుపై పెంకు లెగిరిపోతున్నాయి మేస్టరు లేనప్పుడు మానీటరే కదా క్లాసున కధిపతి! ఈ క్లాసునకు మానీటరైన సూర్యనారాయణ నేర్పరి, సుగుణ సంపన్నుడు, నెమ్మదియైనవాడు, అతని వయస్సును విభజిస్తే మాత్రం ఆ క్లాసు కుర్రాళ్లు ముగ్గిరికి సమం అవుతాడు. ఇతని చదువులో కూడా అలాగే, తన చదువును పంచిపెట్టి ముగ్గురిని ప్యాసు చేయించగలడు, గాని తను మాత్రం ప్యాసవలేదు, సరియైన అలంకారాలన్నీ ధరించి, నోరు తెరవకుండా ఉంటే ఇతనే మేస్టరుపైన మేస్టరు లాగ ఉంటాడు. ఈ సూర్యనారాయణ డస్కు బల్ల వద్దకువెళ్లి మిగిలిన కుర్రాళ్ల అల్లరి మాన్పించుటకై విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు, బల్లను బాదుతున్నాడు;

లెన్సు" అని కేకలేస్తున్నాడు! పేర్లు వ్రాసి మేస్టరుకిస్తా భయపెడుతున్నాడు.

ఇంతలో చంద్రశేఖరమనే విద్యార్థి హడావిడిగా ప్రవేశించాడు. అతని పేరులో ఆరు అక్షరాలున్నప్పటికీ, మొదటి మూడక్షరాలు అతనికీ ఉపయోగించవు, ఒకళ్ళకీ ఉపయోగించవు. ఒక చేతిలో పుస్తకాలున్నాయి; రెండవ చేతిలో గోడుగాడిస్తున్నాడు; కాళ్లతో బూడ్సులశబ్దం, నోట్లోకిళ్ళీ! ఇదంతా చాలక, అందరూ తనను చూస్తున్నారో లేరో అని, పిలక బాగా ఎగిరేలాగ తలను నిలువుగా విసురుతున్నాడు. తను కూర్చునే స్థలంలోకెళ్లి, చప్పుడయేడట్లు నిలువు ఎత్తునుండి పుస్తకాలను నేలమీద పడేశాడు. మానీటరుయొక్క అభిప్రాయానుకూలతను గమనించడానికి వెంటనే వానిమొగం కేసి చూశాడు. మానీటరు, కళ్ళంతా ఎర్రగాచేసుకొని "నువ్వొక్కడనించో" అని ఆర్డరు వదిలేశాడు.

చంద్రశేఖరం డస్కుబల్ల వద్దకువచ్చి చిన్నమొగం చేసుకున్నట్లు నటించి, "నన్నే?" అన్నాడు.

"ఆ: నిన్నే"

"బ్రదర్! అన్నయ్యా! నీకే అంత ఆగ్రహంవస్తే ఎలా బ్రతకడం? పోనీ ఇంకెప్పుడూ అల్లరిచెయ్యనులే. ఈమాటుకు కూర్చుంటాను"

"వొద్దు, నించోవాలి."

"వోరే! అన్నయ్యవు కావు? బ్రతిమాలుకోడం లేదు? ఈమాటికి కూర్చోనియ్యి; ఏం?."

"అయితే ఇంక బెంచెక్కు."

"అమ్మ బాబో, సుగ్రీవాజ్ఞలాగుందే, అందులో దిష్టిబొమ్మలాగ బెంచెక్కడం కూడానా? సరేలే; అట్ల తద్దినాడు నీపని" అంటూ, సమాధానపడి, రెండుచేతులూ బల్లమీదనాన్చి, ఒక కోతిగంతువేసి, ఎగిరి, బల్లమీద నించున్నాడు. మిగిలిన పిల్లలందరూ పక్కున నవ్వారు. మానీటరునకు మరింత కష్టంతోచి "సరే, నీసంగతి మేష్టారు రాగానే చెప్తానులే" అన్నాడు.

ఇంతలో కోటిరెడ్డి సరిగా బడి పంతులులాంటి వేషంవేసి, వచ్చి ఒక అడుగుమాత్రం క్లాసు గదిలో పెట్టాడు. వెంటనే తనకసి తీరేటట్లు సూర్యనారాయణ "ఈ చంద్రశేఖరం అంతా అల్లరేనండి. తమ అల్లరి చేయడమేకాకుండా ఒకళ్ల చేతకూడా నవ్వించి అల్లరి చేయిస్తాడండి" అని పితూరీచేశాడు.

చంద్రశేఖరం "రామ! రామ! నేనేమీ ఎరుగ... ......" అని వాగ్మాలం ప్రారంభించాడుగాని, ఇంతలో మేష్టరు చిరాకుపడి "ఈ క్లాసులో ఎప్పుడూ అల్లరే. ఒక్కనిమిషం చదువూ ఏడుపూ ఉండదు. మేనేజరుగారు పరీక్షకొస్తానన్నారుకూడాను. అప్పుడుకూడా ఇలాగే ఏడుస్తూంటుంది. ఈ చంద్రశేఖరం ఒకడు దెయ్యంలాగ... ... ..."

అని ఇంకా ఏమో చెవుతూండగా విష్ణుచక్రంలాగ సుబ్బిరెడ్డి పరిగెత్తుకొనివచ్చి, "ఇదిగో నాన్నా! సత్యం రాసిన కథ" అని ఒక కాగితం చేతికిచ్చాడు.

ఈ ఒళ్లుతెలియని సందర్భంలో కాలుచున్న చిమ్నీమీద నీళ్లుపోసినట్లయింది. సత్యం ఎవరో, కథ ఏమిటో ఒళ్లు తెలియలేదు. "నువ్వొకడవు పిశాచంలాగ" అని ఆకాగితం పదిహేనుముక్కలుచేసి ఆ సుబ్బిరెడ్డి మొగాన్నే కొట్టాడు. వెనుకనే పరిగెత్తుకొచ్చిన సత్యం తనకథ చిరిగిపోవడంచూచి, సహజగా రాబాన్న పలి పుచ్చుచు, మొగం చిన్నబుచ్చుకొని, అక్కడే చతికిలబడ్డాడు.

మేష్టారికిప్పటికి గ్రహణశక్తి కలిగింది. ఇక ముదరనివ్వకూడదనుకొన్నాడు. సత్యాన్ని సమీపించి లాలించడం ప్రారంభించాడు. అసలు గ్రంథం కట్టిపెట్టి పిల్లలందరూ చుట్టూ మూగారు. ఇంకొక కథ రాసిస్తానన్నారు; పెద్ద కాగితమూ పెన్సులూ ఇస్తానన్నారు. కాని

లాభం లేదు. చాలాసేపయింది సత్యం పట్టువిడవడం లేదు. అతను ఊరుకోనిదే స్కూలు విడువడం ఎలాగ?

సత్యం వేళకు ఇంటికి రాకపోతే రామానుజ రావున కేమీ తోచదు. చాలాసేపు కనిపెట్టినతర్వాత ఎందుచేత రాలేదో తీసుకురమ్మని బంట్రోతును పంపాడు. బంట్రోతైనా పిల్లవానిని ఊరుకోపెట్టలేకపోయాడు. అతను తిరిగి రాకపోవడం చూచి, మేనేజరుగారే స్వయంగా కారులోవచ్చి మేష్టరు గజగజలాడుచుండగా, పిల్లవానిని కారులో కూర్చోపెట్టుకున్నారు. "సాయంత్రం మేష్టారు వస్తారుగా. అప్పుడాయనపని చెప్దాములే" అంటూ కారు సాగించారు.

సాయంత్రంవరకూ కోటిరెడ్డి ఎలా కాలాన్ని గడిపాడో చెప్పడం దుర్లభం. కొంతసేపు కూర్చునేవాడు; వెంటనే లేచి గడియారం ఎయిరుస్ప్రింగులాగ ఇటూఅటూ తిరిగేవాడు; తనరోజుల మహత్వంచేత ఆనాడు గొప్ప అపరాధం చేశినట్లు భావించేవాడు. ఇదేమోస్తరుగా సాయంత్రం బరినిర్వహించి ఇంటికెళ్లాడు; ప్రతి సాయంత్రం మామూలుగాచేసే మేనేజరుగారి దర్శనంకూడా మానేశాడు.

నాటిసాయంత్రం ఒంటరిగా కూర్చోడానికి ఏమీ తోచక బడిపంతులుకోసం చాలాసేపు ఎదురుచూశాడు రామానుజరావు. చివర కూరుకోలేక ఎందుచేత మేష్టారు రాలేదో తెలుసుకొనుటకై ఎవరినైనా పంపుదామని నిశ్చయించుకొన్నాడు. అప్పుడే అదారిని వెడుతున్న సూర్యనారాయణ చంద్రశేఖరాలని పిలిచి, మేష్టారిని ఒకసారి రమ్మని చెప్పవలసినదిగా శలవిచ్చాడు. దగ్గర ఉన్నడవాలీ బంట్రోతు "ఆయన ఇప్పుడు వస్తారండీ? ఆయనకంత పొగరను కొన్నారు. ఆయన కెక్కడా మంచి చెడ్డా తెలియదండీ" అని అడ్డుపుల్లేశాడు. వచ్చిన విద్యార్థు లిద్దరూ కూడా జరిగిందంతా తెలిసినవారే గనుక, కోటిరెడ్డికి కబురందజేయుటకు భయపడి వారి దారిని వారింటి కెళ్ళారు.

మరికొంత సేపటికి బంట్రోతునుపిలిచి "రామిరెడ్డి గారిని పిలుచుకురమ్మనగా అతను హెడ్‌మేష్టరు గార్ని సమీపించి "మిమ్ములను అయ్యగారు రమ్మంటున్నారు" అన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకో లెండి. జమానులంటే మీకు లెక్క ఉందా? మీకు ఉద్యోగం అయిందని మామూలడిగితే లేదంటారూ? ఇవాళ అంతా తేలుతుంది. లెండి— త్వరగా రండి" అని కేకేసి వెళ్ళిపోయాడు.

తను చేసిందంతా అపరాధం. బంట్రోతే అంత నిష్ఠూరంగా మాట్లాడుతుంటే ఇంక మేనేజరుగారెలా ఉంటారో? ఆయనమొగం చూసి ఎలా సమర్థించుకోవడం? చివరకి బ్రతికుంటే బలుసాను తినవచ్చునుకున్నాడు. రోజులడ్డం తిరిగినపుడేమి చేస్తాము? చివరకు మూటముల్లె కట్టి కుటుంబ సహితంగా సాయంత్రం ఏడుగంటలబండి ఎక్కడానికి నిశ్చయించుకున్నాడు. అవసరమైతే రాజీనామా కాగితం పోస్టులో పంపవచ్చునుగదా!

